క్లుప్తంగా

గుండ్లపాడులో ఘనంగా పోలేరమ్మ 6వ వార్షికోత్సవం



వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేద పండితులు వెల్లంకి కృష్ణశర్మ ఆధ్వర్యంలో గుండ్లపాడు గ్రామ అర్చకులు వెల్లంకి సుబ్రహ్మణ్య శర్మ 11 మంది వేద పండితులతో మహా వైభవంగా జరిగింది. గోపతి పెద వెంకటేశ్వర్లు, వెంకట్రామయ్య, యల్లయ్య, తోట శ్రీనివాసరావు పుణ్యదంపతులు పీటల మీద కూర్చొని స్వామి వారి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు వందలాది మంది మహిళలు జలబిందెలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. వేద పండితులు అమ్మవారికి గోపూజ, గణాధిపతి పూజ, చండీహోమం, రుద్రహోమం, మహాన్యాసము, సహస్రకలశ కుంభాభిషేకముతో పాటు మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అమ్మవారి దేవాలయానికి రంగు రంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని 23వ వార్డులో అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జూలకంటి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకురాలు, ఆయా తదితరలు ఉన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



దాచేపల్లి : జగనన్న విద్యా కానుక కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని శ్రీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి తదితరులు కిట్లు విద్యార్థులకు అందించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, దాచేపల్లి సైదారావు, షేక్ డాడీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే కాసు



పిడుగురాళ్లరూరల్: విద్యుత్ తీగ తెగి గాయాలై గుంటూరు జనరల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బీసుపోగు కుమారిని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం జీజీ సూపరింటెండెంట్ ప్రభావతితో కుమారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుమారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా జూలకల్లు గ్రామానికి చెందిన సుభాని గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాస్పటల్‌కు వెళ్లి సుభానిని పరామర్శించి హాస్పటల్ యాజమాన్యంతో సుభానికి అందుతున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వర రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు, జూలకల్లు, అంకారావు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లా రెడ్డిగూడెం గ్రామంలో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మించిన నీటి ట్యాంక్‌ను ఎంపీపీ చింతా శివ రామయ్య శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులకు ప్రతి ట్యాప్‌కు స్టాండ్ వద్ద అనుసంధానంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా మురుగు నీటి సమస్య ఉండదన్నారు. ప్రతి నీటి బొట్టు ఇంకింపబడుతుందన్నారు. ఈ రోజు నుంచి ట్యాంక్‌ను ట్యాప్ స్టాండ్‌ల బాధ్యతను నీటి పర్యవేక్షణ కమిటీ చూసుకుంటుందన్నారు. జెడ్పీటీసీ రూప్లీ బాలు నాయక్, ఎంపీడీఓ డి ప్రసాద్, వాటర్ ఎయిడ్ ఇండియా ఐఎస్ మేడబోయిన గురు ప్రసాద్, పాండునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ బాలునాయక్, పంచాయితీ కార్యదర్శి మకట్ లాల్, వాటర్ ఎయిడ్ ఇండియా ఇంజినీర్ పవన్‌కుమార్, సిఎఫ్‌లు రాజేశ్వరి, లక్ష్మణరావు, రవి వర్మ, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతన్న భరోసా కేంద్రాలు

- వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు..రైతు భరోసా కేంద్రాలు
- రైతుల చెంతకే సేవలు, సలహాలు



పెదగార్లపాడు ఆర్బీకే సెంటర్‌లో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గురజాల : రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో తక్కువ సమయంలోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో 145 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సకల సేవలు అందుబాటులో...

రైతు భరోసా కేంద్రాల్లో వివిధ సేవలు రైతులకు అందుతున్నాయి. స్మార్ట్ టీవీల ద్వారా అధునాతన పద్ధతిలో వీడియోల ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన పుస్తకాలతో , ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునేందుకు కియోస్క్ అందుబాటులో ఉంచడం జరిగింది. విత్తనాలు నాటిన నుంచి పంట అమ్మకం వరకు అన్ని విషయాల్లో రైతు భరోసా కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటున్నాయి, పంట కొనుగోలు సమయంలో కూడా రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు కేంద్రాలు మారిపోయి రైతులు పండించిన పంటను వారి గ్రామంలోనే అమ్ముకునే విధంగా అవకాశం కల్పించారు. గతంలో ఎరువులు కోసం రవాణా చార్జీల భారంతో పాటు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ నేడు రవాణా చార్జీలు తగ్గి వెంటనే కావల్సిన ఎరువులను తీసుకువెళ్లే విధంగా ఆర్బీకేలు అందుబాటులో ఉన్నాయి,

రైతు భరోసా కేంద్రాలు ఇలా...

గురజాల మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉండి నిత్యం రైతులకు వారి సమస్యలకు పరిష్కారమార్గం చూపుతున్నారు. రైతులను శాస్త్రవేత్తలుగా మార్చే విధంగా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచి సమస్య సత్వర పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నారు.

రైతుభరోసా కేంద్రాల్లో అన్ని వసతులు....



రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని వసతులు అందుబాటులో వున్నాయి. రైతు విత్తు నాటిన రోజు నుంచి పంట విక్రయించే వరకు ఏ సమస్య ఉన్నా రైతులకు సత్వర పరిష్కారం లభిస్తుంది. రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధిస్తున్నారు. గతంతో పోల్చితే రైతులకు డబ్బులు, సమయం రెండు ఆదా అవుతున్నాయి.

– దాచేపల్లి, గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ కలకంద ఆంద్రెయ్య

రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు లభ్యం



రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో వున్నాయి. సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించే విధంగా సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నారు. గతంలో రైతులు వారి సమస్యలు పరిష్కారానికి మండల కేంద్రాలకు వెళ్లాల్సివచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితే లేదు. గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటుచేసి ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ పథకాలను రైతులకు వివరిస్తున్నాం.

– శ్రీకృష్ణదేవరాయులు, పిడుగురాళ్ల ఏడీఈ

విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



విద్యార్థులకు బహుమతులిచ్చి సత్కరిస్తున్న విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: పేదల కోసం వేలాది కోట్ల రూపాయలు కేటాయించి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చి ప్రతి పేద విద్యార్థి ఉన్నత స్థాయి చదువు చదువుకోవాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల అభివృద్ధి వివిధ ప్రోత్సాహకాల కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా నియోజక వర్గ స్థాయిలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వందలాది మంది విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సీఎం జగనన్న అధికారంలోకి వచ్చాక విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే నాడు – నేడు కింద పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి జగనన్న ఆణిముత్యాల కింద లక్షల నిధులు కేటాయించి విద్యార్థులను సత్కరించడం ఎంతో మంచి కార్యక్రమమన్నారు. ఈ నేపథ్యంలో నియోజక వర్గంలోని 200 లకు పైగా ఉన్న స్కూళ్ళకు నాడు నేడు, విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన కింద రూ. 200ల కోట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యారంగంలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ అనేక పథకాలను ఉపాధ్యాయుల కోసం తీసుకొచ్చారన్నారు. కరోనాతో రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులలో ఉన్నా పేద విద్యార్థుల కోసం నిరంతరం శ్రమ పడుతున్న ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఏనాడూ పేద విద్యార్థుల ఒక్క పథకాన్నీ మాజీ సీఎం చంద్రబాబు చేపట్టలేదన్నారు. కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించి పేద విద్యార్థుల గురించి ఆలోచించని చంద్రబాబు మళ్ళీ ఏదేదో చెబుతూ అందరినీ మోసగించేందుకు సిద్ధమౌతున్నారన్నారు. ఆయన 14 ఏళ్ళలో విద్యార్థులకిచ్చిన పథకం ఒక్కటైనా ఉందేమో ఆలోచించాలన్నారు. అక్క చెల్లెలు, విద్యార్థులు పేద విద్యార్థుల పాటుపడుతున్న జగన్‌కు మరోసారి మద్దతు పలికి ప్రభుత్వ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో 10వ తరగతిలో 1,2,3 స్థానాలకు, అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1,2,3 నిలిచి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి శాలువలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమానికి నియోజక వర్గ స్పెషలాఫీసర్ గబ్రూ నాయక్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీలు శెట్టిపల్లి యలమంద, మండ్లి పెద మల్లుస్వామి, ఎంపీపీలు బూడిద శ్రీను, చౌడేశ్వరి, చింతా శివరామయ్య, ఆదినారాయణ, కౌన్సిలర్లు గట్ల అరుణ కోటిరెడ్డి, ఎంఈఓలు వేముల నాగయ్య, ఆల్లి సురేష్, ఎస్‌కెబిఆర్ ప్రిన్సిపల్ బుల్లయ్య, హెచ్‌ఎంలు షకీనా, ఐవి నాగమణి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు భారీస్థాయిలో పాల్గొన్నారు. ముందుగా సీఎం జగన్‌కు జే జేలు పలుకుతూ జగన్ మామయ్యకు జే జేలు పలికి పలువురిని ఆకట్టుకున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: జగనన్న ప్రభుత్వం ముమ్మాటికి పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ప్రభుత్వమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. కారెంపూడిలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. పాత ఎంపీడీఓ ఆఫీస్ బజారులో బీసీ కాలనీలో 9వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రతి గడపలో లబ్ధిదారులకు వివరించారు. ఏయే పథకాల కింద ఎంత లబ్ధి చేకూర్చింది చదివి విన్పించారు. ప్రతి కుటుంబానికి రూ. 2 నుంచి 5 లక్షల దాకా చేకూర్చిన లబ్ధిని వివరించే సంక్షేమ కరదీపికలను పీఆర్కే పంపిణీ చేశారు. మీ కష్టాల్లో ప్రభుత్వం అన్నివేళలా తోడు ఉంటుందని ప్రజలకు పీఆర్కే భరోసా కల్పించారు. పేదల అభ్యున్నతి కోసం తాము నిరంతరం శ్రమిస్తున్నామని వివరించారు. గతంలో ఏ సంక్షేమ పథకం పొందాలన్నా పడిన కష్టాలు మీ అందరికి తెలిసినవేనన్నారు. నివేశన స్థలం కావాలన్నా, పింఛన్ కావాలని ఎన్ని సార్లు దరఖాస్తులు చేసినా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా అవి బుట్టదాఖలైన దారుణ పరిస్థితులను గతంలో మీరు చూశారని, ఏదో ఒకటి అర సంక్షేమ పథకాలు అందించినా అవి అందించడానికి కూడా పార్టీ, కుల వివక్షతలు చూపుతూ ఏ విధంగా గత ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసింది అందరికీ తెల్సిందేనని కాని ఇప్పుడు ఆనాటి పరిస్థితిని పూర్తిగా రూపు మాపి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను చేరువ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అర్హులైన వారి వివరాలు సేకరించి ఏ సంక్షేమ పథకం వర్తిస్తే వారికి ఆ సంక్షేమ పథకాన్ని అధికారులు వర్తింప చేసే విధంగా ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు తీసుకుందన్నారు. గ్రామంలోనే గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే సేవలను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శార దా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం, అల్లయ్య, మండల పార్టీ కార్యదర్శి రామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారావు, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తి మండలంలో విద్యుత్ కోత

వెల్దుర్తి: మాచర్ల నుంచి వెల్దుర్తి వెళ్ళే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు కారణంగా 33 కెవి వెల్దుర్తి రెండు ఫీడర్ల లైన్ను షిఫ్టింగ్ పనులు చేయడం జరుగుతుందన్నారు. అందువలన శనివారం వెల్దుర్తి మండలంలోని మండాది, బోదిలవీడు, సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఉయం 7గం''ల నుంచి మధ్యాహ్నం 2గం''ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడిఈ రామయ్య శుక్రవారం తెలిపారు. పై సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.

జగనన్న వెంటే మేమంతా

గురజాల : జగనన్న వెంటే మేమంతా అని అర్బన్ హెల్త్ క్లీనిక్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో ఏపీ ఎస్‌హెచ్ ఏం జెఏసీ సమ్మెకు తమకు ఎటువంటి సంబంధం లేదని తామంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 104 వాహనంలో మిగిలిన పారామెడికల్ సిబ్బందిని రాష్ట్రంలో ఉన్న 560 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నియమించి మిగిలిన ఖాళీలను నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించిన మహానుభావుడు సీఎం అని ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో అర్బన్ హెల్త్ సెంటర్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి మోహన్‌రెడ్డి, జాన్సీ, మల్లేష్ నాయక్, బి ప్రేమ్ కుమార్, ఎన్ దీపిక, సరస్వతి తదితరులున్నారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : సీఐ ప్రభాకర్

గురజాల : దిశ యాప్‌ను కష్టాల్లో ఉన్నప్పుడు మహిళలు, బాలికలు పోలీసుల రక్షణ పొందాలని సీఐ కె ప్రభాకర్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతులు, మహిళలు దిశ యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని దిశ యాప్‌లో ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులతో మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చిన యాప్ దిశ అని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ యాప్ కారణంగా ఎంతో మంది రక్షణ పొందారని అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు టి అశోక్‌కుమార్, బి అనంత కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ స్టాలిన్, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



దాచేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని 6,7 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి చేపట్టారు. వార్డుల్లోకి వచ్చిన ఎమ్మెల్యే కాసుకు మహిళలు హారతి పట్టి ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే కాసు కరపత్రాలు అందజేశారు. వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే కాసు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని నగర పంచాయతీ అధికారులకు ఎమ్మెల్యే కాసు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ..గత నాలుగేళ్లలో నగర పంచాయతీలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించామని, ప్రభుత్వం పనితీరుపట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నగర పంచాయతీకే ప్రమాదకరంగా ఉన్న కాటేరువాగును రూ.30 లక్షలతో ఆధునికీకరణ చేయడంతో ముంపు తప్పించామన్నారు. దాచేపల్లిలో ఇప్పటికే 1900 మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని, మరో నెల రోజుల్లో 1200 మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. రూ.16.50 కోట్లతో దాచేపల్లి, నడికుడి, ఇరికేపల్లి, అలుగుమల్లెపాడు, నారాయణపురంలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రతి ఇంటికి తాగునీరు అందించి అక్కా చెల్లెమ్మలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు. వచ్చే 18 నెలల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. పేద ప్రజల కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాసు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కాసు వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గుంజా వెంకటప్పయ్య, ఇన్‌చార్జీలు కనమర్లపూడి గోపి, బొమ్మనబోయిన మహేష్, కొప్పుల రవికుమార్, మాజీ యార్డు చైర్మన్ మునగా నిమ్మయ్య, నాయకులు దాచేపల్లి సైదారావు, గుంజా శివ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసిన జగనన్న



జగనన్న ఇంటి ముందు నిలబడి ఫొటో దిగిన ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రెండు దశాబ్దాలుగా సొంతింటి కల నెరవేరక బాధపడుతున్న ఓ కుటుంబాన్ని గుర్తించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సుమారు రూ. 5లక్షల విలువైన ఇంటి స్థలాన్ని పిడబ్ల్యూడి కాలనీలో మంజూరు చేశారు. ఆనంద పడిన లబ్ధిదారుడు ఆలేటి యాకోబు కుమారి దంపతులు వెంటనే చకచక సొంతింటి కల నెరవేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. ప్రభుత్వ సహకారంతో సెంటున్నర స్థలంలో అద్భుతమైన జగనన్న కాలనీ ఇంటిని నిర్మించారు. సొంతగా కష్టపడి లబ్ధిదారుడు ఆలేటి యాకోబు ప్రభుత్వమిచ్చిన స్థలంలో రెండు సింగిల్ బెడ్‌రూంలు, హాలు, కిచెన్, వరండా వెనుక భాగంలో అటాచ్డ్ బాత్‌రూం నిర్మాణం చేశాడు. తన కల నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పీఆర్కేలకు జే జేలు కొడుతూ ఆయన నిర్మించుకున్న ఇంటి పై జగన్ చిత్రాన్ని గీయించి జగన్‌కు కృతజ్ఞతలుగా జగనన్న ఇల్లు అనిపేరు పెట్టుకున్నారు. జగనన్న ఇచ్చిన స్థలాలు కనీసం సమాధికి పనికిరావని మాజీ సీఎం చంద్రబాబు విమర్శలు చేశారు. ఎక్కడకు వెళ్ళినా పేదలకు న్యాయం జరగకూడదు. వాళ్ళు సొంత ఇలు నిర్మించుకోకూడదని, ఎస్సీ ఎస్టీ, బీసిల పట్ల కక్ష్యకట్టి దుష్ప్రచారం చేపట్టారన్నారు. కల నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వ విప్ పిఆర్కేలకు కృతజ్ఞత తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం ప్రభుత్వ విప్ పీఆర్కేని గృహ ప్రవేశానికి పిలిచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రభుత్వ విప్ పీఆర్కేని శాలువతో సత్కరించారు.

శ్రీ చక్ర కార్మికులకు నివేశన స్థలాల పట్టాల పంపిణీ



కార్మికులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: స్థానిక శ్రీ చక్ర సిమెంట్ కర్మాగారం కార్మికులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) శుక్రవారం సాయంత్రం నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఫ్యాక్టరీలో దీర్ఘకాలంగా పని చేస్తున్న కార్మికులకు శ్రీ చక్ర సిమెంట్స్ యాజమాన్యం స్థానిక వినుకొండ రోడ్డు పక్కన నివేశన స్థలాలను కేటాయించింది. కార్మికులకు కేటాయించిన నివేశన స్థలాల పట్టాలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పీఆర్కే చేతుల మీదగా యాజమాన్యం పంపిణీ చేయించింది. ఒక్కో కుటుంబానికి 4 సెంట్ల స్థలం చొప్పున 30 మంది కార్మికులకు ఎమ్మెల్యే పీఆర్కే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఫ్యాక్టరీని నమ్ముకుని జీవితకాలం పని చేసిన కార్మికులకు యాజమాన్యం నివేశన స్థలాలు కేటాయించినందుకు యాజమాన్యాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే అభినందించారు. మిగిలిన కార్మికులకు కూడా నివేశన స్థలాలిస్తే వారు కూడా సంతోషంగా ఉంటారని ప్రభుత్వ విప్ పీఆర్కే యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, ఫ్యాక్టరీ జీఎం సైదిరెడ్డి, జీఎం హెచ్‌ఆర్ రాజేంద్ర ప్రసాద్, మురళి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలా భాయితేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, కరాలపాటి సుబ్బారావు, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసులను సద్వినియోగం చేసుకోండి

డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు

పిడుగురాళ్ల: 2023–24 విద్యా సంవత్సరానికి గాను బస్‌పాస్‌లు జారీ చేసున్నట్లు డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలిపారు. ఈ బస్సు పాస్‌లు ఈ నెల 12వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు బస్టాండ్‌లోని కౌంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బస్‌పాసులు జారీ చయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. మగ పిల్లలకు 12 సంవత్సరాల లోపు, ఆడ పిల్లలకు 10వ తరగతి వరకు ఉచితంగా బస్‌పాస్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులు చదువుకునే ఐడీ కార్డ్ తప్పనిసరిగా తీసుకొని రావాలని ఆయన సూచించారు. బస్ పాస్ జారీ చేసే విధానం 5కిలో మీటర్లకు నెలపాస్ 190, మూడు నెలలకు 450, 10 కిలో మీటర్లకు నెల పాస్ 240, 3 నెలల పాస్ 605, 15 కిలో మీటర్లకు నెల పాస్ 290, 3 నెలల పాస్ 755, 20 కిలో మీటర్లకు నెల పాస్ 365, 3 నెలల పాస్ 980, 25 కిలో మీటర్లకు నెల పాస్ 450, 3 నెలలకు 1235 ఉందని తెలిపారు. అయితే వివరాలకు బస్ కౌంటర్ నందు సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

అరుణాచల్ యాత్రకు ప్రత్యేక బస్సు...

జూల్ 1వ తేదీ శనివారం రాత్రి 9 గంటలకు పిడుగురాళ్ల డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేయటమైందని, వివరాలకు డిపో మేనేజర్ : 9959225430 సంప్రదించాలని తెలియజేశారు.

పథకాలు సమర్థంగా అమలు చేయాలి



ఎంపీడీఓ శోభారాణిని సన్మానిస్తున్న సిబ్బంది

దాచేపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎం. శోభారాణి అన్నారు. మండలంలోని కేసానుపల్లిలో శుక్రవారం ఎంపీడీఓ పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామి పథకం పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం పథకాల అమలుతీరు గురించి సిబ్బంది ఎంపీడీఓకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శోభారాణి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా ఉద్యోగులు పని చేయాలని, పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీఓగా శోభారాణి బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా సచివాలయాన్ని సందర్శించడంతో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, వీఆర్వో వెంకటగిరి, సచివాలయం ఉద్యోగులు సురేష్, రసూల్, హనుమంతరావు, సునీత, రమేష్, రమాదేవి, కోటేశ్వరరావు తదితరులు సన్మానించారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు



గర్భిణులను పరిశీలిస్తున్న కరాలపాడు ప్రాథమిక వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, వైద్య సిబ్బంది

పిడుగురాళ్లరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి ముందుకే వైద్యాన్ని తీసుకొని వచ్చిందని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె. ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన ప్రజలకు పలు వైద్యసేవలను అందించారు. సీజనల్ వ్యాధులతో పాటు గర్భిణులకు వైద్య పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి రోగులను పరిశీలిస్తున్నామని, ఎప్పుడు లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వినూత్నమైన కార్యక్రమాన్ని తీసుకొని వచ్చారని, దీని ద్వారా పేద ప్రజల ఇంటి ముందుకే వైద్యం వస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏడుకొండలు, జి. శౌరులు, సీహెచ్‌వోలు పి. సాయి, ఏఎన్‌ఎం కృష్ణకుమారి, హెల్త్ అసిస్టెంట్ వి. జయపాల్, ఆశాలు, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజ



మహా పడి పూజను ప్రారంభిస్తున్న నారాయణ

పిడుగురాళ్లరూరల్: స్వామియే శరణం, అయ్యప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో అయ్యప్పనగర్ మోతమోగింది. మండలంలోని అయ్యప్ప నగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో 26వ ప్రతిష్ట దిన వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మహా దివ్య పడిపూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ దివ్య పడి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ పూజారులు దివ్య పడి పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అయ్యప్ప నామ స్వరణ, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డి, మంగారావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.